# తప్పనిసరి

## కావూరి నరసింహశెట్టి

ఆకాశ మంతా నల్లని కారుమబ్బులతో నిండిపోయింది. అంతవరకూ మసకమసకగా కనుపించే చంద్రునికాంతి పూర్తిగా మబ్బులవెనుక మాయమైపోయింది. మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే ఆచల్లనిగాలి, నల్లని ఆకాశంమీద తళుక్కున మెరిసే ఎర్రని మెరుపులూ, భీకరారణ్యంలో ఆకలిగొన్న బెబ్బులి బొబ్బలలా, అనిశ్శబ్ద నిశీధిని వినిపించే వురుములూ, తప్పక వర్షంకురిసేవాతావరణాన్ని స్పష్టంచేసేయి. వున్నట్లుండి 'ధన్'మని పెద్దచప్పుడు కావడంతో, మేము ప్రయాణం చేసే ఆబస్సుమీదనో, దాని ప్రక్కనో పిడుగుపడిందని అందరి గుండెలు గుభేలుమన్నాయి. మరునిమిషంలో డ్రైవరు కారునాపి, క్రిందికిదిగి, టైరుబరస్ట్ అయిందని చెప్పగానే, ఎక్కడో పడిందనుకున్న పిడుగు మాగుండెల్లోనే పడింది. రాజమండ్రి నుంచి అంగరవెళ్లే బస్సుల్లో అది ఆఖరి బస్సు. మండపేట దాటినతరువాత రోడ్డు గతుకులుగా వుంటుంది. అక్కడనుంచి అంగరచేరుకునేవరకూ అన్నీ పల్లెటూళ్లే! కాస్త భోజనహోటలయినా వుండదు. దురదృష్టవశాత్తూ, మండపేటదాటి రెండు మైళ్లు ముందుకుపోయిన తరువాతనే ఈవిపరీతం ఎదురయింది. ఆడవాళ్ల సీటులో కూర్చున్న మా శ్రీమతి బెదురు బెదురుగా నావైపు చూచింది. నా జాలిచూపులు ఆమెకు సానుభూతిని తెలిపేయి. డ్రైవరు, కండక్టరు సహాయంతో టైరును తీయడానికి ప్రయత్నం చేస్తున్నాడు. పైన ఆకాశం గడబిడలు చేస్తునేవుంది.

మా అన్న కుమారుడు బాబ్జీ వివాహానికని రెండురోజులు ముందుగా బయలుదేరేం. నేనూ మా శ్రీమతీని ముందుగా వెళ్ళడానికి మేం ఎంత ఆత్రుతపడ్డామో, అంత ఆలస్యం అయిపోయింది. "అయినా డాక్టరుపరీక్షు పాసైన బాబ్జీకి, శేకిలాంటి ఆపల్లెటూరిలో వివాహం చేయడమేమిటి?" అని నాలో నేనే మా పెద్దలమీద చీకాకుపడ్డాను. ఆబస్సులో ప్రయాణంచేసే మగప్రయాణీకు లంతా అప్పటికే క్రిందికిదిగి ఏవేవో ప్రశ్నలువేసి డ్రైవరును విసిగిస్తున్నారు. నెమ్మదిగా మా శ్రీమతికూడ క్రిందికి దిగి, దూరంగానుంచున్న నన్ను దగ్గరకు రమ్మన్నట్లు, ఎవరూ చూడకుండా కళ్లతో చక్కని సంజ్ఞచేసింది. నేను నెమ్మదిగా అక్కడకు వెళ్ళేను.

"ఏమి నిశ్చయం చేశారు?" అంది.

"బాబ్జి వివాహం"

"వూరుకుందురూ! ఇలాంటి సమయంలో కూడా మీ వేళాకోళం మానరు"

అప్పుడే తళుక్కున మెరిసిన మెరుపులో మా శ్రీమతి చిరుకోపం స్పష్టంగా కనిపించింది.

"ఏమిచేద్దాం చెప్పండి!"

"ఇంకేం చేయాలి. అదుగో వాళ్ళేదో ఘనకార్యం చేస్తున్నారుగా, అది పూర్తి కాగానే బయలుదేరుదాం"

"పోనీ! ఇంత అవస్థపడి అర్ధరాత్రి వెళ్ళకపోతేనేం! ఈ రాత్రికి ఎక్కడైనా వుండి వుదయమే ఫస్టుబస్సులో వెళ్ళిపోతే మంచిదేమో!"

"సలహా అయితే బాగుందిగాని, దాన్ని ఆచరణలో పెట్టడమే కష్టం."

"ఈ వూళ్ళో మీకు తెలిసినవారెవరూ లేరటండీ".

"వూఁ హుం"

"అయితే ఏం చేద్దామంటారు చెప్పండి. నాకు భయంగావుంది అర్ధరాత్రిప్రయాణం, మెడలో వస్తువులు, పైగా వర్షంవచ్చే సూచనలూనూ" అంది మా శ్రీమతి. అప్పటికిగాని ఆ విషయంగురించి నిశితంగా ఆలోచించాలనే బుద్ధి నాకు పుట్టలేదు. ఇంకా వివాహం మూడురోజు లున్నప్పటికీ నేను ముందుగా వెళ్ళి చక్కబెట్టవలసినపను లుంటాయని, సెలవు దొరకినవెంటనే ఆఖరి బస్సు అని అయినా ఆలోచించకుండా బయలుదేరి త్రోవలో ఇలాంటి అవస్థలు పడవలసి వచ్చింది. ఆ ప్రక్కనున్న పల్లెటూరికివెళితే మాత్రం మాకు భద్రతఏదీ! నేను ఆలోచనలో పడ్డాను.

దూరంగా మినుకు మినుకుమనే దీపంవెలుతురూ, చిరుమువ్వల చప్పుడూ ఏదో బండి మండపేటవైపు వస్తున్నట్టుగా కనిపించింది. మా శ్రీమతిని అక్కడే వుండమని నేను త్వరగా అరఫర్లాంగుదూరం ముందుకు వెళ్లేను. నేననుకున్నట్లుగానే అది ఒక ఖాళీ ఒంటెద్దుబండి. మండపేటకే పోతుంది. రెండుమైళ్లకూ ఒక రూపాయి ఇస్తానంటే బండివాడు ఆనందంతో వప్పుకున్నాడు. బస్సు చెడిపోయి ప్రయాణీకులు చిక్కుల్లో వున్నారని తెలిస్తే వాడు అంత తక్కువ కిరాయికి వప్పుకోడు. బండి బస్సుదగ్గరికివస్తే, ప్రయాణీకుల అవసరాన్ని బట్టి రేట్లుపోటీగా వాళ్లే పెంచుతారు. ఇవన్నీ ఆలోచించే నేను బండికి ఎదురువెళ్ళి కిరాయి కుదుర్చుకుని అందులోకూర్చుని తిన్నగా బస్సు వద్దకు వచ్చేను. అప్పటికే చిన్న చిన్న చినుకులు ప్రారంభమయ్యేయి. బస్సులో నున్న మా సామాన్లు బండిపైవేసుకుని నేనూ మా శ్రీమతీ అందులో కూర్చోవడమూ, అప్పుడే పెద్ద చినుకులు ప్రారంభంకావడం, 'ఇక ఈ రాత్రికి లాభం లేదు. అందరం ఇక్కడ పడివుండవలసిందే' నని డ్రైవరు అనడమూ ఒకదానివెంట ఒకటిగా జరిగిపోయేయి.

బండి కుదుర్చుకువచ్చిన తెలివికి మా శ్రీమతి నన్ను మెచ్చుకుంది. నాకు హుషారు నిచ్చిన ఆమె సమయస్ఫూర్తికి నే నామెను అభినందించేను. చిటపట చినుకుల్లో మా బండి నడక సాగించింది.

"ఇప్పుడు ఎక్కడికి వెళదామండీ" నిశ్శబ్దాన్ని భం[illegible]స్తూ ప్రశ్నించింది మా శ్రీమతి.

"వెనక్కి"

"వెనక్కి వెళుతున్నామని తెలుస్తూందిగా తెలిసినవారెవరూ లేరని చెప్పేరు. మరిఎక్కడుందామని?"

"జ్ఞాపకంవచ్చిందిలే వినాయకరావు అని నాస్నేహితు డొకడు హైస్కూల్లో మేష్టరుగిరీ వెలిగిస్తున్నాడు. పోయి వాడికొంపలో మకాంపెడదాం" అన్నాను.

మా శ్రీమతి నవ్వింది.

"నవ్వుతున్నావేం"

"వూరికేనే"

"చెబుదూ! ఫరవాలేదు"

"లోకంలో అన్ని పేర్లుండగా మీస్నేహితునికి వినాయకరావనే పేరు పెట్టాలా?"

నాకూ నవ్వువచ్చింది.

"వాడు పేరుకుమాత్రమేకాదు ఆకారం కూడ అంతే చిన్నబొజ్జ, చిన్నకళ్లు, పెద్ద

# తప్పనిసరి

చావులు." ఒక్క తొందరం మినహా అన్నీ వున్నాయి."

మరోసారి ఇద్దరమూ నవ్వుకున్నాం. వర్షం జోరు హెచ్చింది. ఎంత వర్షంవచ్చినా తనకు తప్పదన్నట్టు బండికి కట్టినఎద్దు నెమ్మదిగా నడుస్తూనేవుంది. బండిచక్రాలు గుంటలలోపడి బండి కుదుపుకు ఒక్కసారి నేను శ్రీమతిపై పడబోయేను.

"అన్నీ చిలిపిచేష్టలు" అంది శ్రీమతి.

మరుక్షణంలో మరోకుదుపుకు ఆమె నా వడిలో నిజంగానే పడిపోయింది.

"దీనినేమనాలి?"

సిగ్గుతో శ్రీమతి మాట్లాడలేదు. చల్లని గాలికీ, చిటపట-చినుకులకూ మనసులో కమ్మని కోరికలు బయలుదేరేయి.

"మీస్నేహితుడు మంచివాడేనా?"

"అంటే"

"అంటే మనల్ని మర్యాదచేసేవాడేనా అని?"

"ఓ! ఎంతమర్యాద చేస్తాడంటే—వాడు వండుకునే గదికూడ ఖాళీచేసి మనకు ఇస్తాడు."

"చాల్లెద్దురూ! బండవేళాకోళం-అన్నట్టు మీస్నేహితునికి వివాహం అయ్యిందా?"

"అయింది, దానికో గాధకూడ వుంది."

"ఏమిటది చెప్పండి."

"అయితే విను."

* * *

ఆరోజుల్లో నేను స్కూలుఫైనలు చదువుతున్నాను. ఇప్పుడున్నట్టే అప్పుడు కూడా బక్కపలచగా, పొటిగా వుండేవాడిని. ఒకసారి నేనూ, వీడూ అంటే ఈ వినాయకరావూ చెరో సైకిలుమీద కాకినాడ వెళుతున్నాం. అది మంచి వేసవికాలం. మధ్యాహ్నంవేళ ప్రయాణం. ఈ చెవినుంచి ఆ చెవికి గాడ్పుకొడుతోంది. ముఖమంతా చెమటలుపట్టి, గాలికి ఎగిరివచ్చిన కంకర బూడిదతో మిళితమై, ఎర్రని చెమటబిందువుల ద్వారా చేతిరుమాలును పైతం ఎర్రగా మార్చివేసేయి.

మధ్యాహ్నం భోజనాలకు కాకినాడ చేరుకోవాలని మాతాపత్రయం. అందువల్ల




జాఫ్రీ మేన్నర్స్ అండ్ కంపెనీ (ప్రైవేట్ లిమిటెడ్. రిజిస్టర్డు ఉపయోగకులు)
ఒక ప్యాకెట్ ధర 12 నయా పైసలు మాత్రమే

ఎండను లెక్క చేయకుండా ఇద్దరమూ జోరో సైకిలు త్రొక్కుకుపోతున్నాం. నాకంటే వినాయకరావు కాస్త లావు, పొడుగు బలం కూడ కలవాడవడంవల్ల నాకంటే చాలా చురుకుగా సైకిలు త్రొక్కుతూ తనతో సమానంగా సైకిలు త్రొక్కలేకపోతున్నందుకు నామీద తరచుకస్సుబుస్సులాడుతున్నాడు. అసలే ఆకలిగావుంది పైగా ఎండ బాధ, పిడికస్సుస్సులు నన్ను చాలా చికాకు పర్చివేసేయి. కాకినాడదగ్గరగా అంటే పది మైళ్లు ఇవతలగా ఏదో వూరుంది. మేము ఆ పల్లెటూరు చేరుకునేసరికి పన్నెండు దాటింది. మామూలుగా నాకంటె ముందుగాపోయి ఒక చెట్టునీడను విశ్రాంతి తీసుకుంటూ నేను రాగానే మళ్లీ బయలుదేరే వినాయకరావు ఈసారి అలాకాకుండా నేను దగ్గరకువచ్చినా బయలుదేరకుండా తెల్లముఖం వేయడం చూచి నేను తెల్లబోయేను.

"బయలుదేరవేమిరా?" అన్నాను.

"చక్రాలలో గాలిపోయింది" ఇంచుమించు ఏడుపుముఖం పెట్టేడు. నాకు నవ్వు వచ్చింది. నేను నవ్వడంచూచి వాడికి కోపం వచ్చింది.

"ఎందుకురా వెధవ నవ్వు!" అన్నాడు.

నేను అసలే బక్కవాడిని. ఆపోతుగాడు కోపంలో నన్నేమైనా చేస్తాడేమోనని బలవంతంగా నవ్వును ఆపుజేసుకున్నాను.

"తీవ్రాలోచన అభినయిస్తూ" ఇప్పుడేం చేయాలి? అన్నాను.

"అదృష్టవశాత్తు వూరిదగ్గరలో నేవున్నాం. ఇంకొక ఫర్లాంగు నడచిపోయామంటే ఆవూళ్ళో పడతాం. ఎంత పల్లెటూరయినా సైకిలుషాపు, కంపుకొట్టే కాఫీ హోటలూ వుండకపోవు. సైకిలు బాగుచేయడానికి షాపులోఇచ్చి కాఫీ హోటల్లో కాస్త కడుపునింపుకుని చల్లబడినతరువాత బయలుదేరిపోదాం" అన్నాడు.

"బాగానే వుంది ఆలోచన. కాని..."

"కానీ - ఏమిట్రా నీముఖం చెప్పేదేదో చెప్పు" కోపంగా అన్నాడు వినాయకరావు. నాకూ కోపం వచ్చింది. "ప్రతీదానికీ అంత కోపం ఎందుకురా వెధవ కోపం" అన్నాను నేనో శాంతమూర్తిలాగ.

"అది కాదురా. నీవు చెప్పేదేదో చెప్పరాదూ?"

"నీదగ్గర సొమ్ము లేమాత్రం వున్నాయి?" అన్నాను.

"నాదగ్గరేముందిరా! కానీలేదు. నీదగ్గర వుందిగా."

"నావద్ద ఒక్కరూపాయివుంది"

"చాలు! పావలా సైకిలురిపేరు. మిగిలినది మన ఆకలిరిపేరు"

"సరేలే కానీయ్"

ఇద్దరం ఆ పల్లెటూళ్ళో పడ్డాం. తిన్నగా కాఫీహోటలుకు పోదాంఅంటాడుమావాడు. కాని సైకిలు షాపుకువెళ్లి, సైకిలు రిపేరు చార్జీలుపోను మిగతా దానితో కాఫీ హోటలుకు పోదామని నేను. ఏలాగైతేనేం డబ్బు నాదిగనుక నామాటకే విలువ ఇచ్చేడు. తిన్నగా సైకిలుషాపుకు చేరుకున్నాం. షాపువాడు ట్యూబులు బైటికితీసి పరీక్షించి 'రెండు జాయింట్లు కరిగిపోయేయి. ముప్పావలా అవుతుం'దన్నాడు. నా గుండెలు జారిపోయేయి. ముప్పావలా వాడికి చెల్లించి మిగిలిన పావలాలో ఇద్దరం ఎలా కడుపు నింపుకోవడం? రావుగాడు నాకంటే బేజారెత్తిపోయేడు. మాగోడవలో మేమువుంటే ప్రక్కన స్టూలుమీద కూర్చుని, కమ్మని చుట్టనుకాలుస్తూ, వేడిగాలిని ఆరగిస్తూన్న పల్లెటూరి రైతుగారు మా యోగక్షేమాలు అడగడం మొదలు పెట్టేడు.

"ఏవూరు వెళతారు అబ్బాయిలూ"

"కాకినాడ" అన్నాను నేను రావుగాడు మాట్లాడేస్థితిలో లేడు. 'దప్పిచే నాలుక తడిపొడిలేక' అన్నట్లుంది వాడి అవస్థ.

"పాపం! ఇంకా చాలా దూరం వుందే"

"ఔను. ఎక్కడినుంచి వస్తున్నారు?"

మా వూరిపేరు చెప్పేను.

"అరే! ఆ వూళ్లో మా దూరపుబంధువులున్నారండీ. కాని చాలాకాలంనుంచి వారికీ మాకూ రాకపోకలు లేవు"

"ఎవరండీ"

"వెంకయ్యగారనీ—కొలువ అవతలవారి లోగిళ్లు"

నేను ఆశ్చర్యంగా ఆ ముసలాయనవైపు చూచేను. ఎందుకంటే తన బంధువు అంటున్నది మా నాన్నగారినే. రావుగాడు కంగారుగా లేచేడు.

"ఔనండి. వారు మా నాన్నగారే" అన్నాడు.

ఆ ముసలాయన ఆశ్చర్యంగా వాడివైపు చూచేడు. "ఏమిటేమిటీ! నీవు ఫలానా వెంకయ్యగారి కుమారుడవా? ఎన్నోవాడివి బాబూ?"

"ఆఖరివాడినండి"

"ఏం చదువుతున్నావు నాయనా"

"స్కూలు ఫైనలు"

"బాగుంది. పేరు?"

మావాడు కొంచెం తికమక పడ్డాడు. మా నాన్నగారిని తన నాన్నగారని చెప్పుకున్నాడు. సరి నా స్థానంలో వాడు ప్రవేశించి ఆఖరివాడినని చెప్పుకున్నాడు. తీరా పేరు అడిగేసరికి నా పేరు చెప్పడమూ లేక తన స్వంతపేరు చెప్పడమూ అనే సందిగ్ధంలో పడ్డాడు. ఆఖరికి తెగించి "వినాయకరావు" అన్నాడు.

"సరే నాయనా! తలవని తలంపుగా మా వూరు రానేవచ్చేరు. భోజన సమయం. మా ఇంట్లో భోజనంచేసి, విశ్రాంతి తీసుకుని


జీవితమును
మలబద్ధకము
భారముగా చేయనీయకండి




తలనొప్పులు, గోపిష్ఠితనము, ఆకలిమాంద్యము, నిస్సత్తువ మందగొడితనము ఇవన్నీ శరీరములోని అపరిశుద్ధతకు పర్యవసానములు కావచ్చును కాని మలబద్ధకము మీ జీవితాన్ని పెద్ద భారముగా చేయనవసరము లేదు బ్రూక్లాక్స్ సేవించడనే తిరిగి సత్తువ చేకూరును. రుచికరమైన యీ చాక్లెట్ విరేచనకారి మలాశయమును శుభ్రపరచి మలిన పదార్థములను తప్పక నిరపాయముగా వెడలగొట్టును. ఈ రాత్రి ఒక చిన్న ముక్క సేవించండి రేపు ఎంత చులకనగా ఎంత చురుకుగా వుంటుందో గమనించండి కాని తప్పక మీరడిగేది బ్రూక్లాక్స్ అని మాత్రం రూఢి చేసుకోండి.

బ్రూక్లాక్స్
మిమ్ముల రాత్రికి రాత్రి
సరిదిద్దును
(వెస్ట్ మినిస్టర్ లాబొరేటరీస్ లిమిటెడ్ లండన్ వారి నిర్మాణము)

ఇండెంటింగు ఏజంట్లు ఓరియంటల్ మర్కెంటైల్ ఏజన్సీ, మద్రాసు-1

బ్రాంచి : 17/11 7 నాగేశ్వరరావురోడ్, విజయవాడ-2.

# ★ తప్పనిసరి ★

తల్లబడిన తరువాత వెళుదురుగాని — "సాయిబూ! సైకిలు రిపేరుచేసి ఇక్కడే వుంచు. వీరు మా ఇంటిలో భోజనంచేసి తరువాత వస్తారు. జాగ్రత్త!" అని సైకిలు షాపువాడిని హెచ్చరించి "రండి! బాబూ! రండి" అని తాను ముందు నడుస్తున్నాడు.

మాకు ఆ పరిస్థితుల్లో భోజనానికి వెళ్ళడం ఎంతో ఆనందంగానే వుంది. నాకంటె రావుకు మరీ ఆనందంగా వుంది. అయినా కొస్త బెట్టుగా "ఎందుకు లెండి! సైకిలు బాగు చేయగానే వెళ్ళిపోతాం" అన్నాడు. "సరి సరి! ఇంకా నయం! మనం అంతా బంధువులం. అంత భిడియం ఎందుకు బాబూ! నేనేం పరాయివాడినా! ఇప్పుడు మా ఇంట్లో భోంచేసి వెళితే నేను మరో రోజున మీ ఇంటికి వస్తాను. దానితో దూరమైన మన బంధుత్వం మళ్ళీ దగ్గరవుతుంది. లెండి, లెండి" చేయి పట్టుకున్నాడు ముసలాయన "ఎల్లండిసార్! రామయ్యగారిలాంటి మోతుబరి రైతు సేతుల్ పట్టుకుంటే ఇంకా నూతారేం" సైకిలుషాపు సాయిబు హెచ్చరించేడు. తప్పనిసరి అన్నట్లు రావు లేచేడు. అతని వెనకాల నేనూ లేచేను. త్రోవలో ఆ ముసలాయన మా అన్నలగురించి ప్రశ్నించేడు. రావుకు అన్నీ తెలిసి వుండడంవల్ల, నా స్థానంలో వుండి నేను చెప్పవలసిన సంగతులన్నీ వాడే చెబుతున్నాడు. నేను మాట్లాడకుండా వారివెనుకనే నడుస్తున్నాను. అక్కడకు దగ్గరలోనే వున్న పెంకుటింటి ముందు ముసలాయన ఆగేడు. రెండు పెద్ద అరుగులూ, వాటిముందు కొబ్బరి చెట్లూ, చుట్టూ విశాలమైన ఖాళీ స్థలం, ఆ యింటికి హంగులు కూర్చేయి. అరుగులమీద నున్న కుర్చీలలో మమ్మల్ని కూర్చోబెట్టి ముసలాయన ఇంటిలోనికి వెళ్ళేడు.

అరుగులమీద కూర్చున్న మాకు, వట్టివేళ్ల చాపల్లోనించి వచ్చిన గాలి హాయి కలిగించింది. నేను నెమ్మదిగా రావుతో అన్నాను.

"ఏమిట్రా! తెగకోసేశావు?"

"కాస్సేపు వూరుకోరా బాబూ! నీకు పుణ్యం వుంటుంది" బ్రతిమాలుతున్నట్లు చూసేడు. వాడిని చూస్తే నాకు జాలివేసింది. ఇంతలో ఓ కుర్రాడు రెండు తుండుగుడ్డలు తెచ్చి ఇద్దరినీ స్నానానికి లేవమన్నాడు. ఒక పనివాడు వచ్చి, ఇంటిముందున్న నూతిలోనుంచి నీళ్లుతోడి ప్రక్కనున్న పెద్ద గాబులలో పోసేడు. సబ్బు చేత్తో పట్టుకుని కుర్రవాడు మాకు త్రోవ చూపించేడు. ఎండ వేడికి వుడుకెత్తిపోయిన మా శరీరాలకు నూతిలోని చల్లని నీరు తగలగానే ప్రాణాలు లేచి వచ్చినట్లయింది. తృప్తితీరా స్నానంచేసి తిరిగి వచ్చి బట్టలు వేసుకున్నాం! ఇంతలో ముసలాయన వచ్చి భోజనాలకు లేవమన్నాడు. అప్పటికే భోజనాలవేళ మించి ఆకలి జోరుగా వేస్తుండడంవల్ల మాట్లాడకుండా ఆయన వెనకనే చావిట్లోకి వెళ్ళి, విస్తర్లలో వడ్డించిన భోజనాలముందు కూర్చున్నాం. ముసలాయన దగరగా కూర్చుని, నేయి, కూరలు పెరుగు, మామిడి పండ్లు బలవంతంగా వడ్డించేడు. ఆ వడ్డించడంలో రావును ఎక్కువ బలవంతంచేయడం, నేను పొందవలసిన ఆ గౌరవాన్ని వాడు పొందుతున్నందుకు నేను అసూయపడ్డాను. మేము భోజనాలు చేస్తున్న సమయంలో ప్రక్క గదుల్లోనుంచి మమ్మల్ని చూస్తున్న ఆడవాళ్ళ గాజుల గలగలలు వినిపించేయి. ప్రక్కలకు చూద్దుముగదా ఒకరిమీద మరొకరు పడి మావైపు వింతగా చూస్తూన్నారు. నాకేమో సిగ్గనిపించింది. రావుమాత్రం ఠీవిగా కూర్చుని వడ్డించే కుర్రాడితో ఏవేవో వేళాకోళాలు మొదలుపెట్టేడు. వాడి హాస్యాలకు మధ్య మధ్య గదులలోనుంచి సన్నని నవ్వులువినిపిస్తూ వుండేవి. భోజనాలు పూర్తి చేసి మేము బయటికి వచ్చేసరికి అరుగుల మీద నులక మంచాలమీద ప్రక్కలు అమర్చబడి వున్నాయి. మమ్మలను పండుకోమని ముసలాయన ఎక్కడికో వెళ్ళిపోయేడు. మేము ఎక్కువ శ్రమ లేకుండానే హాయిగా నిద్రపోయాం. నేను లేచేసరికి నాలుగు గంటలయింది. రావుఇంకా మత్తుగానిద్రపోతూనే వున్నాడు. వాడిని లేపి కూర్చోబెట్టేను. ఇంతలో కుర్రవాడు సబ్బు, నీళ్లు తెచ్చి, ముందుపెట్టేడు. లేచి ముఖాలుకడుక్కునే సరికి మళ్ళీ ముసలాయన వచ్చి, కాఫీలకు లేవమన్నాడు. ఈ మర్యాదలకు రావూ, నేనూ ఉక్కిరిబిక్కిరైపోయాము. వేడి వేడి ఫలహారాలతో కాఫీకూడ ముగించి, ఆరోజు అక్కడ వుండిపొమ్మని ఆయన బ్రతిమాలినా వినకుండా బయలుదేరి కాకినాడ వెళ్లిపోయేము. వెళ్లేముందు మావాడు మర్యాదకు "ఒకసారి మాయింటికి దయచేయాలి మీరు" అన్నాడు, "అవశ్యం" అన్నాడాయన.

వెళ్ళిపోయే మమ్మల్ని ఆడవాళ్ళచూపులు వెన్నంటుతూనే వున్నాయి చాటునుంచి.

ఇంతవరకూ విని మా శ్రీమతి నవ్వింది.

"నవ్వుతున్నావేం?" అన్నాను.

"ఆఖరున చెబుతాలెండి" అంది.

"హేయ్! హేయ్!" అని బండివాడు ఎద్దును అదలిస్తున్నాడు. వర్షపుజల్లు తగ్గింది. ప్రక్కనున్న చెట్ల ఆకులనుండి గాలి కుదుపుకు టపటపా బండి గూడుమీద చినుకులు పడుతున్నాయి.

"కానీయండి! మధ్యలో ప్రశ్నలు వేయవద్దని మీరూ, కథలు మధ్యలో ఆపకూడదని నేనూ మన వివాహమైన క్రొత్తరోజుల్లోనే నిర్ణయించుకున్నాంగా" కొంటెగా చూచింది శ్రీమతి.

"కాకినాడలో రెండురోజులు రావుతో వాళ్ళ ఇంటివద్దవుండి తిరిగి నేనొక్కడినీ మా యింటికి చేరుకున్నాను. వీధివైపు చావిడిలో మా అన్నలు ఇద్దరూ, ఇంకా అయిదారుగురు పెద్దలూ కూర్చుని వున్నారు. ఆ చావిట్లో ఎప్పుడూ ఎవరో కొంతమంది కూర్చుంటూనే వుంటారు. అందువల్ల నేనెవరినీ పరీక్షగా చూడకుండా ఎండలో వచ్చిన కారణంవల్ల స్నానం చేయాలనే తొందరవల్ల లోపలకు పోతున్నాను.

"అదుగో వాడూ వచ్చేడు." అన్న మా పెద్దన్నయ్యగారి స్వరం విని అలాచూచేను.

"వీరిని ఎరుగవురా" అంటూ ప్రక్కన వున్న ఆసామీని చూపించేరు. ఆయన మాకు విందుచేసిన ముసలాయన. నేను నమస్కారం చెప్పేను. తెల్లబోయి చూస్తూ మళ్ళీ నమస్కారం పెట్టేడు. నేను చెమటలు కక్కుతూండడంవల్ల "లోపలికి పోయి స్నానం చేయి" అన్నారు మా అన్న. నేను లోపలకి వెళ్లేను.

నన్ను మొట్టమొదట మా చిన్నవదిన చూచింది.

"అదిగో! పెండ్లికొడుకుకూడ వచ్చేసేడు" అని నవ్వింది. ఎవరనో అని వెనక్కు తిరిగి చూచేను. ఎవ్వరూ లేరు.

"నిన్నే నయ్యా! ఏమీ ఎరుగనట్లు నటించ నక్కరలేదు."

"ఎవరు వదినా! చంపక చెబుదూ [illegible]" గారం గునుస్తున్నట్లుగా అన్నాను. వదిన నవ్వింది.

"నీవే అంత గడుసువాడి వనుకుంటున్నావు కాబోలు!

"నీ పెండ్లికి నీవే ప్రయత్నించాలటయ్యా! మీ అన్నలు లేరూ! ఇంకా నవ్వుతూనే అంది చిన్నవదిన. అంతలో పెద్దవదిన ఆవిడకు సహాయపడింది.

"మామగారిని ముందుపంపించి, నీవు సంగనాచిలా వెనకాల వచ్చేవన్నమాట."

"అబ్బ! అన్నదమ్ముల బుద్ధులు! ఎక్కడికిపోతాయి" అంది చిన్నవదిన.

"ఏమిటి అన్నదమ్ములందరినీ అనేస్తున్నావు" అంటూ మా చిన్నఅన్న లోపలికి వచ్చేరు.

"అదే! తెలియకుండా వెళ్లి పెండ్లికూతురును చూచుకోవడం" కొంటెగా జవాబిచ్చింది చిన్నవదిన.

# ★ తప్పనిసరి ★

"వాడినేం వెక్కిరిస్తావులే! రామయ్య గారు వెళ్ళిపోయేరు"

"మాటలు అయిపోయేయి కాబోలు ఎప్పుడా ముహూర్తం?"

"అబ్బే! వారి అమ్మాయి వీడిమీద బలంగా వుంటుందట. వరహీనంగా కనిపిస్తుం దని వెళ్ళిపోయేరు."

"అదేమిటర? ముందుగా పెండ్లికొడుకును చూచేవచ్చేనన్నారు గదాండి ఆయన?"

"ఔను కాని వీడినికాదు. వీడితో వెళ్లిన వినాయకరావును చూచి వాడినే వీడనుకున్నారట."

"అదేలా అనుకుంటారండీ?" ప్రశ్నించింది వదిన.

ఇంతలో రామయ్యగారిని సాగనంపి మా పెదఅన్నగారు కూడా అక్కడకు రావటంవల్ల చిన్నవదిన లోపలకు తప్పుకుంది

"అసలు జరిగిన సంగతేమిటర?" అని అడిగేరు పెద అన్నయ్య. నేను మొదటినుంచీ జరిగినవన్నీ చెప్పేను అంతా విని అందరూ గట్టిగా నవ్వేసేరు

"బాబూ! వూరిలోనికి వచ్చేసేం! ఎవరింటికి వెళ్లాలండి" అన్నాడు బండివాడు

"హైస్కూల్లో టీచరు వినాయకరావు గారి ఇంటికి"

"సరేనండి-హాయ్! హాయ్" అంటూ ఎద్దును హెచ్చరించేడు

"నేను అందుకే నవ్వేను," అంది శ్రీమతి

"ఎందుకు?"

"మీరు భోజనాలు చేసేటప్పుడు ఆడవాళ్లు ప్రక్కగదుల్లోనుంచి చూస్తున్నారని మీరు చెప్పినప్పుడే అనుకున్నాను వారింటిలో పెండ్లి ఈడుకు వచ్చిన అమ్మాయి వుండి వుంటుందని"

"నీవూ అసాధ్యురాలవే!" అన్నాను

"బాబూ! అయ్యగారింటికి వచ్చేసేమండి" అన్న బండివాడి హెచ్చరిక విని బండిలోనుంచి క్రిందికి వురికేను. ఆకాశం నిర్మలంగా వుంది టైము చూచుకున్నాను ఒంటిగంట అయింది.

సామాన్లు అరుగుమీదపెట్టించి బండివాడి చేతనే వినాయకరావును పిలిపించేను. కొంచెంసేపటికి వాడు లేచి బైటికివచ్చేడు. కాని నన్ను వెంటనే పోల్చుకోలేకపోయేడు. బండివాడికి కిరాయి ఇచ్చి పంపించివేసేను. ఇంకా వినాయకరావు నన్ను వింతగా చూస్తూనే వున్నాడు

"ఇంకా నిద్రమత్తు వదల్లేదా యేంగా?" అన్నాను

"అరే నీవటరా! చీకటిలో గుర్తుకట్టలేకపోయేను," అంటూ హడావిడిగా సామాను గదిలో వేసి, మమ్మల్ని లోపలికి ఆహ్వానించేడు అక్కడవున్న ఒక కుర్చీలో నేను కూర్చున్నాను మా శ్రీమతి ప్రక్కనే నిలబడింది. రావు ప్రక్కగదిలోనికి వెళ్లేడు.

ఏదో విపరీతమైన శబ్దం మా చెవులు బ్రద్దలుకొడుతోంది. కొంచెంసేపు పిల్లలు పోట్లాడుకుంటున్నా యనుకున్నాను మళ్లీ అంతలోనే పాము బుసకొడుతోందను కున్నాను మళ్లీ పులుముతేమో అనుకున్నాను ప్రక్కగదిలోనుంచి మావాడు ఎంతకూ రాడు. అంతలోనే "వూం!" అని ఒక సింహగర్జనలా వినిపించింది శబ్దం ఆగిపోయింది ప్రక్కగదిలో గుసగుసలు వినిపించేయి తరువాత మా స్నేహితుడు బైటికివచ్చి నాతో మాటలు మొదలు పెట్టేడు. రెండు నిమిషాలువుండి "గంగా భవానీ! గంగాభవానీ!" అని రెండు కేకలు పెట్టేడు. అంతలోనే బరువైన శరీరాన్ని మోయలేక ఆయాసంతో వగర్చుకుంటూ ఒక పెద్ద గున్న ఏనుగులాంటి మనిషి మాముందు ప్రత్యక్షమయింది.

"చూడు గంగాభవానీ! వీడు నా స్నేహితుడు సుబ్బారావు. ఆవిడ.. ఎందుకో సందేహించేడు.

"మా శ్రీమతి" అని పూర్తిచేసేను. ఆవిడ నమస్కారం చేసింది. తిరిగి నమస్కారం చేసేను

"ఆవిడను లోపలకు తీసుకువెళు"

"రండి" అని ఆవిడ మా శ్రీమతిని లోపలకు తీసుకు వెళుతోంది.

"అన్నట్లు గంగా భవానీ" అని ఆగేరావు ఆవిడ వెనుదిరిగి చూచింది.

"ఈ సుబ్బారావు ఎవరో తెలుసా?"

తెలీదన్నట్లు చూచింది "సరేలే! వెళ్లు" ఆవిడ వెళ్లిపోయింది.

"మా ఆవిడ నీకు తెలుసనుకుంటురా?"

"ఎట్లా తెలుస్తుంది? మనం కలుసుకుని రమారమి పది సంవత్సరాలవుతుందను కుంటాను"

"కావచ్చు, ఈమె రామయ్యగారి కూతురు"

"ఏ రామయ్యగారు?"

"నీకు మతి మరుపు ఎక్కువరా! ఒకసారి మనం కాకినాడ వెళుతూం . "

"చాలు చాలు! ఇక చెప్పకు జ్ఞాపకం వచ్చింది'

కొంచెంసేపు నేను మాట్లాడలేకపోయేను

"ప్రాణం బుల్ రావుల్ దప్పెను. మూర్ఛవచ్చె" అన్నంత పని అయిందినాకు ఆ మహాస్వరూపాన్ని మా వినాయకరావు గనుక భరిస్తున్నాడుగాని నాలాంటి బక్క వాడయితే ఏమి కావాలి?

"ఆ రామయ్యగారు మీ ఇంటికి వచ్చేరటగా! వచ్చి నిన్ను చూచినతర్వాత సంగతంతా తెలుసుకున్నారు. నీతోవున్న వాడిని నేనేనని మీ అన్నద్వారా తెలుసుకుని, నా అడ్రసు తీసుకుని మా ఇంటికివచ్చి మా వివాహం నిశ్చయించేరు నాకు తప్పనిసరి అయింది" "బాగానే వుందిగాని, అంత పెద్ద పేరుపెట్టుకు పిలవక పోతేనేం! ఏదైనా చిన్నపేరు పెట్టుకోకూడదటరా" అన్నాను మాకు వుండే స్నేహభావంతో. వినాయకరావు నవ్వేడు.

"చిన్నపేరతో పిలిస్తే ఆమెకు వచ్చుదురా! తన పూర్తిపేరుతోనే పిలవాలంటుంది"

ఈ మహాస్వరూపాన్ని వరహీనం అవుతుందనే కారణంగా నాకు అంటగట కుండా, ఆ గండంనుంచి నన్ను శాశ్వతంగా గట్టెక్కించిన ఆ రామయ్యగారికే నాలో నేనే ధన్యవాదాలు అర్పించుకున్నాను ఆ మరునాడు వుదయమే మేము మా బాబీ వివాహానికి వెళ్లిపోయేము. ★


## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD)

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు జ్ఞాపకశక్తి కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు 6-0-0 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.).



## నారసింహ లేహ్యము




బంగారుతో చేరినది మేహము, నిస్త్రాణ, నిస్పత్తువ వగైరా హరించి. బలము రక్తవృద్ధి కల్గించును 20 తు. డబ్బీ రు 3-4-0 పోస్టేజి రు 1-1-0

ఏ వి ఎ అండ్ కో, (ఆయుర్వేద సమాజం) పెరిదేపి (పోస్టు) — నెల్లూరుజిల్లా.